మన తెలంగాణ
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

## స్టాన్‌ఫోర్డ్ విద్యార్థుల కేస్ స్టడీగా

# హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు

### విజయగాథగా ఎంపిక చేసిన యూనివర్సిటీ

### ఇదొక అరుదైన గౌరవం : హైదరాబాద్ మెట్రో ఎండి ఎన్వీయస్ రెడ్డి






మన తెలంగాణ/సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుల విజయగాథను ప్రపంచ ప్రఖ్యాత స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్ మెంట్ విద్యార్థులకు, ప్రాక్టీషనర్లకు కేస్ స్టడీగా ఆ సంస్థ ప్రచురించే స్టాన్ ఫోర్డ్ సోషల్ ఇన్నోవేషన్ రివ్యూ తాజా సంచికలో (స్ప్రింగ్ 2024) ప్రచురించింది. ఇది ఒక భారతీయ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుకు దక్కిన అరుదైన గౌరవంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) అభివర్ణించింది. ప్రపంచంలో చేపట్టిన పలు భారీ ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే అనేక సమస్యలు, వాటిని అధిగమించడానికి కావాల్సిన నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై తగిన సూచనలు, పరిష్కార మార్గాలను ఈ త్రైమాసిక జర్నల్ అందజేస్తుంది. ప్రపంచం మొత్తంలో ఉన్న అనేక ప్రాజెక్టుల విస్తృత అధ్యయనాల గట్టి పోటీ మధ్య ఐయస్‌బి మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ రామ్ నిడుమోలు, ఆయన బృందం హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్‌పై జరిపిన అధ్యయనాన్ని స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం కేస్ స్టడీగా ఎన్నుకుని ప్రచురించింది. పిపిపి విధానంలో చేపట్టిన మెట్రోరైల్ ప్రాజెక్టు విజయవంతం కావడంలో ఎండి ఎన్వీయస్ రెడ్డి బృందం అసాధారణ నాయకత్వ ప్రతిభను కనపరిచారని ఈ అధ్యయనంలో పేర్కొన్నారు. ప్రప్రథమంగా మేటాస్ కన్సార్టియం వైఫల్యం, అనేక ప్రజా ఆందోళనలు, సామాజిక, రాజకీయ, మతపరమైన సున్నిత అంశాలపై ఎన్నో సవాళ్ళు, అనేక కోర్టు కేసులు ఈ ప్రాజెక్టు ఎదుర్కొన్నదని వారు వివరించారు. ఒక సందర్భంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసిన ఘనత ఈ సంస్థ ఎండీకి దక్కుతుందని వారు తమ అధ్యయనంలో పేర్కొన్నారు. ప్రాజెక్టుని వ్యతిరేకించిన వారే, ఆ దరిమిలా గొప్ప మద్దతుదారులుగా మారారని, చివరిగా వారు ప్రాజెక్టుని విజయపథంలో నడిపించారని, ఇది వీరి నాయకత్వ పటిమకు చిహ్నామని సహేతుకంగా ఈ కేస్ స్టడీ తెలియజేసింది. ప్రాజెక్ట్ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాయితీదారు, రుణాలిచ్చే బ్యాంకులు, పలు ప్రైవేటు ఆస్తుల యజమానులు, వర్తక సంఘాలు, వ్యాపార సంఘాలు, హాకర్ల సంఘాలు, సామాజిక, మత పరమైన సంస్థలు వారి వారి వ్యక్తిగత ప్రయోజనాలు, ఆంకాంక్షలను పరిరక్షిస్తూనే, ఎండి ఈ ప్రాజెక్టు విజయానికి కారకులయ్యారని అధ్యయనంలో పేర్కొంది. ఎన్వీఎస్ రెడ్డి ఒక సాధారణ ప్రభుత్వ అధికారిలా వ్యవహరించలేదని, ప్రాజెక్టు విజయవంతమే తమ లక్ష్యంగా పనిచేశారని పేర్కొన్నారు. ఆయన ఈ ప్రాజెక్ట్ పట్ల అభిరుచి, నిబద్ధతతో పాటు కలుపుగోరుతనం, స్పష్టమైన సమాచారంతో గొప్ప నాయకత్వ ప్రతిభ కనబరిచాడని ఈ అధ్యయనం ప్రశంసించింది. ప్రైవేట్ రంగ మూలధనం, వనరుల వినియోగం ద్వారా ప్రజా ప్రయోజనాల కోసం భారీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రాజెక్ట్స్ ఎలా నిర్మించాలో మేనేజ్‌మెంట్ ప్రాక్టీషనర్స్ హైదరాబాద్ మెట్రో అనుభవం నుండి ఎంతో నేర్చుకోవచ్చని సూచించింది. పత్రికా ప్రతినిధుల నుంచి సమాజంలోని అన్ని వర్గాల వారి సహకారంతో సామాజిక ప్రగతి ఎలా సాధించవచ్చునో ఈ ప్రాజెక్టు తెలియజేస్తోందని తెలిపింది. హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందుతున్న తరుణంలో, నగర విస్తరణలో మెట్రోరైలు కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదని, ప్రైవేటు పెట్టుబడులతో ప్రజాప్రయోజన ప్రాజెక్టుల నిర్మాణం ఏవిధంగా సాధ్యమో ఈ ప్రాజెక్టు ద్వారా అవగతమవుతుందని ఈ అధ్యయనం పేర్కొంది.

Date: 11/03/2024, Edition: Hyderabad Main, Page: 7
Source : https://epaper.manatelangana.news/